# దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాల, గూడూరు.

## విగ్రహావిష్కరణ - గ్రంధావిష్కరణ మహోత్సవ కార్యక్రమం

09.08.2024

ప్రముఖ పారిశ్రామికవేత్త, వితరణశీలి, కళాశాల అభివృద్ధికై తపించిన గొప్పవ్యక్తి "శ్రీ అల్లారెడ్డి శ్యామసుందరరెడ్డి గారు".

వైద్యాన్ని వృత్తిగాను, సేవా తత్వాన్ని ప్రవృత్తిగానూ స్వీకరించిన వైద్యశిఖామణి,విద్యావేత్త, ఆధ్యాత్మిక సేవాతత్పరులు డా ॥ సి.ఆర్.రెడ్డి గారు.

సమాజశ్రేయస్సుకు పేద మహిళల విద్యాభివృద్ధికై గణనీయంగా కృషి చేసిన ఈ ఇరువురు మహానుభావులు నిస్వార్ధంగా,అవిశ్రాంతంగా చేసిన కఠోరశ్రమ ఫలితంగా చదువుల తల్లి ఈ ప్రాంగణంలో సుస్థిరంగా కొలువుతీరింది.




గూడూరు దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాల ప్రాంగణానికి ఆగష్టు 9, 2024 ఉదయం 10 గంటల 30 ని॥లకు విగ్రహావిష్కరణ - గ్రంధావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారత మాజీ ఉపరాష్ట్రపతి గౌ ॥ డా.వెంకయ్య నాయుడు గారు విచ్చేసినారు. భారత స్వాతంత్ర్య అమృతోత్సవాలలో (ఆజాదీ కా అమృత మహోత్సవ్) భాగంగా కళాశాల ప్రాంగణంలో శ్రీ వెంకయ్య నాయుడు గారు జాతీయ జెండాను ఎగురవేసినారు.







తదుపరి లేట్ శ్రీ అల్లారెడ్డి శ్యామసుందరరెడ్డి గారి మరియు లేట్ డా॥ సి.ఆర్.రెడ్డి గారి కాంస్య విగ్రహావిష్కరణ వారిరువురి కుటుంబ సభ్యులు, కళాశాల కమిటీ మెంబర్లు, సిబ్బంది, విద్యార్థినులు, అతిథులు, ఆహ్వానితుల హర్షధ్వానాల నడుమ కార్యక్రమ ముఖ్య అతిథులు గౌ॥ డా.వెంకయ్య నాయుడు గారి చేతుల మీదుగా దిగ్విజయంగా జరిగింది.








"మహనీయమూర్తి-డాక్టర్ సి.ఆర్.రెడ్డి" జీవిత చరిత్ర గ్రంధావిష్కరణ సభ ముఖ్య అతిథులు, విశిష్ట అతిథులు, కళాశాల అధ్యక్షులు, కార్యదర్శులచే జ్యోతి ప్రజ్వలన - విద్యార్థినుల ప్రార్థనాగీతం కార్యక్రమం తో ప్రారంభమైనది.



**కళాశాల కార్యదర్శి డా॥ మెహర్‌మణి గారు తమ స్వాగతోపన్యాసంలో విగ్రహావిష్కరణ గురించి మాట్లాడుతూ;**




చిన్న పట్టణమైన గూడూరులో ఉన్నత విద్య అభ్యసించడానికి పట్టణానికి దూరంగావున్న ప్రభుత్వ కళాశాలకు వెళ్ళడానికి విద్యార్థినులు పడుతున్న కష్టాలు చూసి వారికి ప్రత్యేకంగా ఒక కళాశాల నడిపిస్తే బాగుంటుందని సహృదయతతో సి.ఆర్.రెడ్డి గారు సంకల్పించడం, ఆ సంకల్పం కార్యరూపం దాల్చడానికి శ్రీ శ్యామసుందరరెడ్డి గారు ప్రభుత్వ అనుమతికి చెల్లించవలసిన 2 లక్షల రూపాయలు చెల్లించి తన అత్తగారైన దువ్వూరు రమణమ్మ గారి పేరిట కళాశాలను ప్రారంభించారు. వీరిరువురూ తమ మిత్రులు, సమాజ శ్రేయస్సు కోరేటటువంటి వారిని 10 మందిని కార్యవర్గ సభ్యులుగా ఏర్పరచుకొని ఇది ఒక రోటరీ సంస్థగా సవేరా ట్రస్ట్ తరపున స్పాన్సర్ చేయబడి, పేద విద్యార్థినులకు సేవలందించే సంస్థగా ఈ కళాశాల స్థాపించారు. స్థాపించినప్పటి నుండి 6సం..పాటు రాజా యాచేంద్ర వారు వారి భవనాలను కళాశాల నిర్వహణకు ఉచితంగా ఇచ్చినందుకు సభా ముఖంగా ధన్యవాదాలు తెలియచేసారు.

ఎవరైనా కొంత వితరణ చేస్తే అంతటితో తమ బాధ్యత అయిపోతుంది అనుకుంటారు. కానీ శ్యాంసుందరరెడ్డి గారు అలా అనుకోకుండా తన మిత్రుడైన సి.ఆర్. రెడ్డి గారితో కలిసి నిరంతరం అవిరళ కృషి, అకుంటిత దీక్ష, అంకిత భావంతో అసాధ్యాన్ని సుసాధ్యం చేసారు. అసాధ్యం ఎందుకంటే ఈ కళాశాల ఉన్న స్థలం ఒకప్పుడు తమ్మిశెట్టి గుంట అనే చెఱువు. చాలా కాలంగా నిరుపయోగంగా పాడుబడి ఉన్న ప్రభుత్వ స్థలం. చెల్లించాల్సిన రుసుము చెల్లిస్తే ప్రభుత్వం వారు కళాశాలకు ఇస్తామనగా శ్యాంసుందరరెడ్డి గారు గూడూరు నడిబోడ్డులో 5 ఎకరాల స్థలం కళాశాల ఏర్పాటుకు ఒక వరంగా భావించి, ప్రభుత్వానికి సొమ్ము చెల్లించి మిత్రులు ఇరువురు స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. పెద్ద నీటిగుంట పై భవన నిర్మాణం చేసేందుకు అంచనాల తయారీకి శ్యాంసుందరరెడ్డి గారు చెన్నై నుండి ఇంజనీర్లని పిలిపించి ప్రణాళిక సిద్ధం చేయించారు.25 అడుగుల లోతును మట్టితో పూడ్చటానికి మిత్రులిద్దరూ ఆలోచించారు. సి.ఆర్. రెడ్డి గారు తన వైద్యాకర్షణ శక్తిని ఉపయోగించి చుట్టుపక్కల గ్రామాలలో రైతులను కూడగట్టి, మహిళా విద్య కోసం అని వారిని ప్రోత్సహించి, రైతులచే ఉచితంగా వేలాది ట్రాక్టర్ల మట్టిని తోలించి ఈ గుంటను పూడ్పించి భవన నిర్మాణానికి సిద్ధమయ్యారు. 1987లో ప్రభుత్వం వారు విధించినటువంటి నిబంధనల ప్రకారం ఒక తరగతి గదికి 600 చదరపు అడుగులు ఉండాలి. ఆ కాలంలో ఒక గది నిర్మించడానికి 45 వేల రూపాయలు అవుతుందని నిర్ణయం చేసారు. సంకల్పం మంచిదైతే భగవంతుని యొక్క దయ ఉంటుంది అనే దానికి నిదర్శనంగా ఆరోజు ప్రభుత్వం వారు కొత్తగా ప్రవేశపెట్టిన "గ్రామీణ క్రాంతి పథం" అనే పథకం ద్వారా ఒక గదికి 15 వేలు మంజూరు అయ్యాయి. మిగతా 30 వేల కోసం డాక్టరు గారు తమ సమ్మోహనాస్త్రం వంటి ప్రోత్సాహంతో 15 వేలు ఇచ్చిన దాతల పేరుతో గదిని నిర్మిస్తామన్నారు. వెంటనే 32 మంది దాతలు ముందుకు వచ్చారు.శ్యాంసుందరరెడ్డి గారు తమ స్వంత నిధులు కూడా ఇచ్చి మూడు అంతస్థులలో 32 గదులను నిర్మాణం చేయించారు. నెల్లూరు రేబాల లక్ష్మీనరసారెడ్డి గారి విరాళంతో అసెంబ్లీ హాలు నిర్మాణం జరిగింది.

భవన నిర్మాణానికి శ్యాంసుందరరెడ్డి గారు నిధులు సమకూరిస్తే, నిత్యం కార్యనిర్వహణకు, జీతభత్యాలకి 9 సంవత్సరాల కాలం(1981-1990) డాక్టరు గారు తమ స్వంత నిధులతో నడిపించారు.

కళాశాలను ఇంత అభివృద్ధి చేయడానికి పునాదుల నుంచి భవన నిర్మాణం పూర్తయ్యేవరకూ వారు స్వయంగా పనివాళ్ళతో నిలబడి ఎండ వానా చూసుకోకుండా శ్రమ చేసారన్నారు.

శ్యాంసుందరరెడ్డి గారు విద్యార్థినుల భద్రత, సౌకర్యం కోసం వసతి గృహాన్ని నిర్మించాలని భావించి, అందుకు ఎవరినీ దాతలను అడగకుండా కేవలం శ్యాంసుందరరెడ్డి గారే లక్షలాది రూపాయలు వెచ్చించి 32 గదులతో 3 అంతస్థుల భవనాన్ని వసతిగృహం కొరకు ఏర్పాటు చేసారు. తర్వాత 1990 లో కాలేజీ గ్రాంట్ ఇన్ ఎయిడ్ కి ప్రభుత్వం వారు ముందుకు వచ్చినప్పుడు 2 లక్షలు కట్టాల్సిన అవసరం ఏర్పడింది. అప్పుడు డా॥ సి.ఆర్.రెడ్డి గారు తన స్వంత నిధులను 2 లక్షలు ప్రభుత్వానికి చెల్లించి గ్రాంట్ ఇన్ ఎయిడ్ కి తెప్పించారు.

నిస్వార్థంగా వారు చేసినటువంటి ఆ సేవలకు ఒక చిన్న గుర్తింపుగా, తరువాతి తరాలకు తెలిసే విధంగా వారి విగ్రహాలను ఇక్కడ ప్రతిష్టించడం జరిగిందని కళాశాల ఏర్పాటు చేయుటకు వారిరువురు పడిన కష్టాన్ని డా॥ మెహర్‌మణి గారు సవివరంగా సభికులకు తెలియచేసారు.

కళాశాల ప్రారంభించి 42 సం॥ పూర్తయింది. ఈ 42 సం॥లలో వేలాదిమంది ఆడపిల్లలు ముఖ్యంగా పేద వర్గానికి చెందినటువంటివారు ఇక్కడ విద్యనభ్యసించి దేశ, విదేశాలలో ఉన్నత పదవులలో ఉన్నారు. అది శ్యాంసుందరరెడ్డి గారికి, డాక్టరు గారికి ఎంతో సంతోషాన్నిచ్చేటటువంటి విషయం అన్నారు.

డాక్టరు గారు కాలేజీకి కరస్పాండెంట్‌గా కాక, ఒక తండ్రి తన కుటుంబాన్ని చాలా క్రమశిక్షణతో, వాళ్ళందరూ ఉన్నతంగా ఎదగాలని ఎలా కోరుకుంటారో! ఆ విధంగా సిబ్బందిని, విద్యార్థినులని ఎంతో క్రమశిక్షణతో వాళ్ళు జీవితంలో ఉన్నతంగా ఎదిగేలా తీర్చిదిద్దారు. "కష్టపడి పనిచేయకండి - ఇష్టపడి పనిచేయండి - ఇష్టంతో పని చేస్తే దేనిలో అయినా విజయం సాధించవచ్చు" అని డాక్టరు గారు చెప్పేవారు. ఆ మాటని ఆదర్శంగా తీసుకుని ఈ కళాశాలలో పనిచేసి వెళ్ళిపోయిన స్టాఫ్ మెంబర్స్, ఇప్పుడు పనిచేస్తున్నవారు అదే ఆదర్శంతో పనిచేస్తున్నారన్నారు.

**పుస్తకావిష్కరణ గురించి ప్రస్తావిస్తూ;**

ఒక వ్యక్తి యొక్క సేవ గురించి ఉపన్యాసాలు చెప్తే ఆ రోజుతోనే ముగిసిపోతుంది, కానీ దాన్ని శాశ్వతం చేయాలంటే పుస్తక రూపంలో ఉంటే తర్వాతి తరానికి ఉపకరిస్తుందనే ఉద్దేశ్యంతో డాక్టరు గారి జీవిత చరిత్రను ప్రచురించాలని నిర్ణయించినట్లు తెలియచేసారు.

శ్యాంసుందరరెడ్డి గారు 32సం॥లు, డాక్టరు గారు 42సం॥లు నిరంతరం కళాశాల అభివృద్ధికి అవిరళ కృషి చేసారు. 2012 లో శ్యాంసుందరరెడ్డి గారు మరణించిన తర్వాత వారి కుమారుడు రవికుమార్‌రెడ్డి గారు కళాశాల ప్రెసిడెంటుగా బాధ్యత స్వీకరించి, తండ్రితో సమానంగా ఈ కాలేజీపై అభిమానంతో కాలేజీ ఉన్నతికి చివరి శ్వాస వరకూ పనిచేసారు. వారి అకాల మరణం కాలేజికి తీరని లోటు అని, ఆ తర్వాత వారి సోదరులు శివకుమార్ రెడ్డి గారు ప్రెసిడెంట్ బాధ్యతలు స్వీకరించారు.

కళాశాల అభివృద్ధికి వారిద్దరూ చేసినటువంటి ఆ సేవల్ని సవివరంగా, సవిస్తరంగా పుస్తక రూపంలో ప్రచురించినందున సహృదయులందరూ దాన్ని చదివి, తరువాతి తరానికి అందిస్తారని ఆశిస్తున్నట్టుగా డా॥మెహర్‌మణి గారు తెలియచేసారు.

**కళాశాల అధ్యక్షులు శ్రీ ఎం. శివకుమార్ రెడ్డి గారు విగ్రహావిష్కరణ - గ్రంధావిష్కరణ గురించి తమ సందేశాన్ని తెలియచేసారు.**



## పుస్తకావిష్కరణ కార్యక్రమం :-

"మహనీయమూర్తి - డాక్టర్ సి.ఆర్ రెడ్డి" జీవిత చరిత్ర పుస్తకాన్ని కార్యక్రమ ముఖ్య అతిథులు భారత మాజీ ఉపరాష్ట్రపతి గౌ॥ డా॥ వెంకయ్య నాయుడు గారు ఆవిష్కరించి మొదటి ప్రతిని డాక్టర్ సి.ఆర్. రెడ్డి గారి కుమార్తె డా॥ రోహిణి గారికి అందచేయడం జరిగినది.



గూడూరు శిరిడి సాయి కల్చరల్ మిషన్ సభ్యులు శ్రీ టి వి శ్రీధర్ గారు చక్కని శైలిలో సభికులకు గ్రంథ పరిచయాన్ని చేసారు.






## విశిష్ట అతిధుల సందేశం :-

ఆచార్య సి.ఎం.కె.రెడ్డి గారు సి.ఆర్.రెడ్డి గారిని చిల్లకూరు వారి కుటుంబంలో కోహినూర్ డైమండ్ గా అభివర్ణించారు. డాక్టరు గారు తన కుటుంబంలోని వారు, తన సిబ్బందిలోని ప్రతి ఒక్కరి అభివృద్ధి కాంక్షించారని, క్రమశిక్షణ,విద్య విలువ తెలియచేసి ప్రోత్సహించేవారని అన్నారు.మాతృభాష పరిరక్షణ గురించి చెపుతూ,మాతృభాష పట్ల శ్రీవెంకయ్య నాయుడు గారికి గల శ్రద్ధ గురించి తెలియచేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా విచ్చేసినందుకు గౌ॥ డా.వెంకయ్య నాయుడు గారికి ధన్యవాదాలు తెలియచేసారు.




గూడూరు శాసన సభ్యులు శ్రీ పాశం సునీల్ కుమార్ గారు మాట్లాడుతూ “సి.ఆర్.రెడ్డి గారంటే ఒక బ్రాండ్, గూడూరంటే సి.ఆర్.రెడ్డి - సి.ఆర్.రెడ్డి అంటే గూడూరు” అన్నారు. సి.ఆర్.రెడ్డి గారు ఆదర్శప్రాయులు, వైద్యుడిగా పేద ప్రజలకు మహోన్నతసేవలందించారు. వారి హస్తవాసి మంచిదని అందరికీ నమ్మకం. అదే ప్రేమాభిమానాలతో వారి కుమార్తె-అల్లుడు డా॥ రోహిణమ్మ జనార్ధనరెడ్డి గార్లు వైద్యసేవలందిస్తున్నారు. గూడూరులో అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ, ఈ కళాశాలను జిల్లాలోనే ఒక మోడల్‌గా మెహర్‌మణి గారు తీర్చిదిద్దినారని వారికి తన ధన్యవాదాలు తెలియచేసారు. మహానుభావులైన సి.ఆర్.రెడ్డి గారిని ఆదర్శంగా తీసుకోవాలని కోరుతూ, సి.ఆర్.రెడ్డి గారి ఆశయాలు ముందుకు తీసుకుపోయేందుకు మా వంతు కృషి చేస్తామని తమ సందేశాన్ని తెలియచేసారు.




జూనియర్ కళాశాల ప్రధానాచార్యులు శ్రీ రావు సురేష్ గారు సభకు ముఖ్య అతిథి పరిచయం గావించారు.



### ముఖ్య అతిధి సందేశం:-

కార్యక్రమ ముఖ్య అతిధి గౌ॥ డా॥ వెంకయ్య నాయుడు గారు మాట్లాడుతూ దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాల స్థాపన, అభివృద్ధి వెనుక మూలకారకులైన మిత్రద్వయం శ్రీ ఏ శ్యామసుందరరెడ్డి, డా.సి.రాధాకృష్ణారెడ్డి గార్ల విగ్రహాలను ఆవిష్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆరోజుల్లోనే ఆడ పిల్లల కోసం ప్రత్యేక కళాశాల స్థాపించాలన్న వారి ఆలోచన స్ఫూర్తిదాయకం అన్నారు. విగ్రహాలు పెట్టడం చాలా మంచి పని. వారిని చూసినప్పుడు మిగతావారికి ఆ స్ఫూర్తి కలుగుతుంది అన్నారు. వారిరువురికి నివాళులర్పించారు.

సాధించాలన్న పట్టుదల, క్రమశిక్షణ, కష్టపడి పనిచేసే తత్వం, చిత్తశుద్ధి, కార్యదీక్ష వంటివి శ్రీ శ్యామసుందరరెడ్డి గారి బలాలు. ఆడంబరాలకు తావులేని జీవితాన్ని గడిపిన వారి జీవితంలోకి ఒక్కసారి పరికిస్తే మనకు జీవితం అర్థం అవుతుంది.దువ్వూరు నారాయణరెడ్డి- రమణమ్మ దంపతులకు చిర యశస్సు సంపాదించిపెట్టారాయన. రుచి-శుచి కలగలిపిన ఆంధ్రా పచ్చళ్ళను దేశవిదేశాలకు పరిచయం చేసిన ఘనత శ్యామసుందరరెడ్డి గారిదే అన్నారు.

డా.సి.రాధాకృష్ణారెడ్డి గారి జీవితమంతా సేవే. తమ స్వంత ఊరు చవటపాళెం పక్కనే ఇనకపాళెం పి.హెచ్.సి లో డాక్టరు గారు విధులు నిర్వహించారన్నారు. "పేదల డాక్టరు"గా ఆయన పేరుప్రఖ్యాతలు సంపాదించారన్నారు. సి.ఆర్.రెడ్డి గారి జీవిత ప్రస్థానం పుస్తకాన్ని ఆవిష్కరించటం మరింత ఆనందంగా ఉంది. వారి జీవితంలో సగం ఈ కాలేజీలోనే కనిపిస్తుందని అభిప్రాయపడ్డారు.

మహిళా సాధికారత వల్లనే దేశాభివృద్ధి జరుగుతుందని, పరిపాలన, అభివృద్ధికి చెందిన అనేక అంశాలలో మహిళలు తమ శక్తిసామర్థ్యాలు నిరూపిస్తున్నారని ఆయన అన్నారు. జీవితంలో రాణించాలంటే నిత్యవిద్యార్థిగా ఉండాలి.ఎన్నో తెలిసినా ఇంకా తెలుసుకోవలసిన విషయాలు ఉన్నాయి. విద్యా విషయంలో ఎక్కువ శ్రద్ధ చూపించి ప్రతి అమ్మాయి బడికి వెళ్ళాలి. ముఖ్యంగా మహిళలు బాగా విద్యావంతులు కావాలి. మహిళలు విద్యావంతులు అయితే కుటుంబ ఆరోగ్యం మెరుగుపడుతుంది. శిశు మరణాల రేటు తగ్గుతుంది. ఎక్కువమంది స్త్రీలు పనిచేసినప్పుడు ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతుంది.ముఖ్యంగా వ్యవసాయం వంటి రంగాలలో ఉత్పాదకత పెరుగుతుంది. ఈ కళాశాలలో విద్యార్థినులు అత్యంత భద్రతతో విద్యనభ్యసిస్తున్నారంటే అది వారిద్దరి నిస్వార్థ సేవా,కృషి ఫలితమే. ఈ గూడూరు ప్రాంత ప్రజలు వారిద్దరినీ ఎల్లప్పుడూ గుర్తుపెట్టుకోవాలన్నారు. "ఇష్టమైన పని కష్టపడైనా సరే ఇష్టపడి పని చేస్తే నష్టపడేది లేదు" అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుపెటుకోవాలి. దాని ద్వారా మనకు ఆత్మతృప్తితోపాటూ సమాజానికి మేలు జరుగుతుంది. సమాజం మన తర్వాత కూడా మనల్ని గుర్తు పెట్టుకుంటుంది. అలా చనిపోయిన తర్వాత కూడా సమాజం గుర్తుపెట్టుకునే వారిలో శ్యామసుందరరెడ్డిగారు, సి.ఆర్.రెడ్డిగారు ఉన్నారన్నారు. "షేర్ & కేర్ ఈజ్ ద కోర్ ఆఫ్ ఇండియన్ ఫిలాసఫీ" కష్టపడి పెంచుకోవాలి. పెంచుకున్నదాంట్లో పంచుకోవాలి. అందువలన ఇతరులు మిమ్మల్ని ఆశీర్వదిస్తారు.మన పెద్దలు అలా జీవించారు. ఈనాటి యువతరం అది గ్రహించాలన్నారు."కన్నతల్లిని, జన్మభూమిని, మాతృభాషను, చదువు చెప్పిన గురువును మరచినవాడు మానవుడే కాదు" అని తెలుసుకోవాలన్నారు.



### అతిధులకు చిరు సత్కారం:-

ముఖ్య అతిధులు గౌ॥ డా॥ వెంకయ్యనాయుడు గారిని కళాశాల ఉపాధ్యక్షులు డా ॥ జనార్ధనరెడ్డిగారు శాలువతో, కళాశాల కోశాధికారి శ్రీ విద్యాసాగర్ గారు పూలమాలతో నత్కరించారు. కళాశాల కార్యదర్శి డా॥ మెహర్‌మణి గారు జ్ఞాపికను బహూకరించారు.







విశిష్ట అతిధులు గౌ॥ డా॥ సునీల్ కుమార్ గారిని కళాశాల అధ్యక్షులు డా॥ జనార్ధనరెడ్డిగారు శాలువతో, కళాశాల కోశాధికారి శ్రీ విద్యాసాగర్ గారు పూలమాలతో నత్కరించారు. కళాశాల కార్యదర్శి డా॥ మెహర్‌మణి గారు జ్ఞాపికను బహూకరించారు.







విశిష్ట అతిధులు ఆచార్య సి.ఎం.కె.రెడ్డి గారిని కళాశాల కోశాధికారి శ్రీ విద్యాసాగర్ గారు శాలువతో, కళాశాల ఉపాధ్యక్షులు డా॥ జనార్ధనరెడ్డిగారు పూలమాలతో సత్కరించారు. కళాశాల కార్యదర్శి డా॥ మెహర్‌మణి గారు జ్ఞాపికను బహూకరించారు.





వందన సమర్పణ:-

డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు శ్రీ ఎ.ఇ.పి. హనుమంతరావు గారు వందన సమర్పణ చేసారు.




జాతీయగీత ఆలాపనతో ఈ మహత్తర కార్యక్రమం దిగ్విజయంగా ముగిసింది.





***************

ఈనాడు శనివారం ఆగస్టు 10, 2024

# మహిళా సాధికారతతోనే సమాజంలో మార్పు



శ్యామ్‌సుందర్‌రెడ్డి, సీఆర్‌రెడ్డి విగ్రహాల వద్ద మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు తదితరులు

**గూడూరు పట్టణం, న్యూస్‌టుడే:** గొప్పతనం అనేది సంపాదించడం కాదు.. సద్వినియోగం చేసుకోవడంలో ఉందని పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. గూడూరులోని దువ్వూరు రమణమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో కళాశాల వ్యవస్థాపక అధ్యక్ష, కార్యదర్శులు అల్లారెడ్డి శ్యామ్‌సుందర్ రెడ్డి, డాక్టర్ చెరుకూరి రాధాకృష్ణారెడ్డి విగ్రహాలను శుక్రవారం ప్రారంభించి, డాక్టర్ సీఆర్ రెడ్డి జీవిత ప్రస్థాన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహనీయుల జీవితాన్ని ముందు తరాలవారు తెలుసుకొని, వారి స్ఫూర్తితో సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని చెప్పారు. 1981లో 56 మంది విద్యార్థులు, 6 మంది ఉపాధ్యాయులతో ప్రారంభమైన కళాశాల నేడు ఆదర్శనీయమైన స్థాయిలో ఉండటం గర్వకారణమన్నారు. పట్టుదల, క్రమశిక్షణ, కష్టపడే తత్వం, చిత్తశుద్ధి, కార్యదీక్షను నమ్ముకున్న వారు గొప్ప వ్యక్తులన్నారు. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. గూడూరు అభివృద్ధికి ఎంతో కృషి చేసిన శ్యామ్‌సుందర్‌రెడ్డి, డాక్టర్ సీఆర్ రెడ్డి లాంటి మహనీయులను స్మరించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షుడు ఆచార్య సీఎంకేరెడ్డి, ప్రతినిధులు డాక్టర్ జనార్దన్‌రెడ్డి, డాక్టర్ రోహిణి, కళాశాల ప్రిన్సిపల్ హనుమంతరావు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి



# సంపదను పంచడంలోనే ఆనందం

● మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

గూడూరు, ఆగస్టు 9 : మన సంపాదనలో కొంతభాగాన్ని సమాజానికి పంచడంలోనే నిజమైన ఆనందం వుందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. శుక్రవారం గూడూరు డీఆర్‌డబ్ల్యు కళాశాలలో వ్యవస్థాపక అధ్యక్ష, కార్యదర్శులు అల్లారెడ్డి శ్యామ్‌సుందర్‌రెడ్డి,డాక్టర్ సీఆర్‌రెడ్డి విగ్రహాలను ఆవిష్కరించారు.అనంతరం డాక్టర్ సీఆర్‌రెడ్డి జీవిత ప్రస్థానం పుస్తకాన్ని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ గూడూరులో మహిళలు విద్యల్లో రాణించేందుకు స్నేహితులైన శ్యామ్‌సుందర్ రెడ్డి, సీఆర్‌రెడ్డి 1980వ సంవత్సరంలో దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాలను స్థాపించి ఉన్నతస్థాయికి తీసుకురావడం సంతోషదాయకమన్నారు.ఈ కళాశాల వేలాదిమంది మహిళల జీవితాలకు ఉన్నత బాట చూపిందన్నారు.ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఉన్నతచదువులతోనే ఉజ్వల భవిష్యత్తుంటుందన్నారు. శ్యామ్‌సుందర్‌రెడ్డి, డాక్టర్ సీఆర్‌రెడ్డి ఆశయాలను కళాశాల యాజమాన్యం ముందుకు తీసుకెళ్లడం అభినందనీయమన్నారు.అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ సీఎంకే రెడ్డి, డాక్టర్ రోహిణి, డాక్టర్ జనార్దన రెడ్డి, డాక్టర్ మెహర్‌మణి, హనుమంతరావు, బి.సురేంద్రరెడ్డి, సుధీర్‌రెడ్డి, విద్యాసాగర్‌రావు, రమణబాబు, ముని గిరీష్ పాల్గొన్నారు.



**M. Venkaiah Naidu**

గూడూరులోని దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాలలో ఈ విద్యాసంస్థ స్థాపన, అభివృద్ధి వెనుక మూలకారకులైన మిత్రద్వయం శ్రీ ఏ.శ్యామ... See more




113

**Face book post**